# 'డ' కార పంచకము

బహుళ విద్యలన్ని పాకశాస్త్రము బోలు
వంటకమును బోలు భక్తి ఒకటె
వంటకంబు వదలి పాకశాస్త్రమదేల
భక్తి వదలి వేరు ఆసక్తి యేల

ఆర్థికమునకు పరుగు, ఆఫీసునకు పరుగు
విద్యలకును పరుగు బస్సు పరుగు
పరమ శ్రేయమునకు పరుగిడజాలరు
మరువబోకు డిటువంటి మంచిమాట

**విద్యార్థులారా!**

విశ్వమే ఒక విద్యాలయము. ఇందులోని ప్రతిపాణి విద్యార్థియే. ఒక్కొక్క విద్యార్థి ఒక్కొక్క మార్గమును అవలంబించి ఒక్కొక్క విధమైన విషయమునందు ఒక్కొక్క పట్టము నందుకుంటున్నాడు. అయితే, సామాన్యమైన విద్యాసంస్థలయందు అనేక విధములైన సబ్జెక్ట్సు వుండినప్పటికి వారికి సంబంధించిన సబ్జెక్ట్సు మాత్రమే వారు యెన్నుకుంటారు. ఈ సబ్జెక్ట్సులోపల అనేక గ్రూప్స్ వుంటాయి. ఒకరు P.C.M. అంటారు. మరొకరు P.C.Z. తీసుకుంటారు. ఈ విధముగా ఆర్ట్సు, సైన్సు, కామర్సు అని వారి వారి అభిరుచులకొద్ది వారు ఎన్నుకుంటారు. అయితే ఏ విధమైన మార్గమును వారు అనుసరించినప్పటికిని అందరికి ఏకోన్ముఖమైనది, గమ్యమైనది, భవ్యమైనది ఒక్కటి వున్నది. అదే, భగవత్ప్రేమ అనే పట్టమునందుకోటము. మిలట్రీలోపల ప్రవేశించినవారు ఒకరు barber గా వుండవచ్చును. ఒకరు dhobiగా వుండవచ్చును. ఒకరు watchman గా వుండవచ్చును. యింకొకరు సిపాయిగా వుండవచ్చును. ఇంకొకరు కల్నల్‌గా వుండవచ్చును. యింకొకరు మేజర్ కావచ్చును. వారి

sri sathyasai vachanamrutam

పదవులలో ప్రత్యేకత వుండినప్పటికిని తుపాకి కొట్టటం, పెరేడ్‌నందు నడచటం ఈ రెండు అందరికి అత్యవసరమే! అదేవిధముగానే ఈ విశ్వమనే విద్యాలయమునందు నైతిక, భౌతిక, ధార్మిక, ఆధ్యాత్మిక, లౌకిక, వైజ్ఞానిక యిలాంటి మార్గములు ఎన్ని వుండినప్పటికిని అన్నింటికిని కీలకమైనది ఆధ్యాత్మికము. ఈ ఆధ్యాత్మికమునందుకూడను కొన్ని subjects వున్నాయి. దైవప్రేమను పొందుటకు కొన్ని ప్రత్యేకమైన groups వుంటున్నాయి. వీటినే దకార పంచకములని చెబుతూ వచ్చారు.

మొట్టమొదటిది, 'ప్రపత్తి' అనగా dedication. రెండవది, 'భక్తి' అనగా devotion, మూడవది 'నియమము' అనగా discipline; నాల్గవది, 'విచారణా శక్తి' discrimination. ఐదవది, 'పట్టుదల' determination. యీ ఐదు dedication, devotion, discipline, discrimination, determination ఈ ఐదు దకారపంచకములు. ఈ ఐదింటిని గ్రూపుగా తీసుకుని ఉత్తీర్ణులైన వారికి భగవత్ప్రేమకు అధికారము వుంటుండాది.

**జీవునకు, దేవునకు మధ్యగల అహంకారమనే అడ్డుగోడ తీసివెయ్యాలి**

మొదటిది Dedication అనగా భగవదర్పితము. స్వామి యిక్కడకు వచ్చిన తక్షణమే ప్రతి అధ్యాపకుడు, ప్రతి విద్యార్థి మొట్టమొదట ఒక పుష్పమును అర్పితము చేసి నమస్కరిస్తున్నాడు. పుష్పమును అర్పితమనగా కేవలము హృదయ పుష్పము. ఈ పుష్పముపైన కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యములనే insects యేమాత్రము వుండకూడదు. ఇలాంటి పురుగులున్న పుష్పమును మనము భగవంతునికి అర్పితము చేయము. వీటిని తీసివేసి పుష్పమును పరిశుద్ధము చేసి, ఆ పుష్పమును యే పెద్దలకైన, భగవంతునికైనా అర్పితము చేస్తూవుంటాము. ఇక్కడ భగవంతునికి అర్పితము చేసే పుష్పములో ప్రధానమైన మాలిన్యములు రెండు వుంటున్నాయి. మొదటిది అహంకారము, రెండవది అసూయ. అహంకారమనేది అష్టవిధములుగా వుంటున్నది. ధన అహంకారము, యవ్వనాహంకారము, బలఅహంకారము, కులఅహంకారము, విద్యాహంకారము, సౌందర్యాహంకారము, రాజ్యాహంకారము, తపస్సహంకారము. ఇందులో రెండు మాత్రము అనగా ధన అహంకారము, విద్యాహంకారము చాలా నీచమైనవి. ఈ అహంకారమనే అడ్డుగోడ వుండినంతవరకు

sri sathyasai vachanamrutam

భగవత్ దర్శనముగాని, ఆత్మతత్త్వము గుర్తించుకోటానికి గానీ సాధ్యము కాదు. కావున జీవునకు, దేవునకు మధ్య ఈ అహంకారమనే అడ్డుగోడను తీసివేయాలి.

**కలిమి కలిగిననాడు కైలాస పతినైన**
**లెక్కచేయక పాపి తిరుగుచుండు**
**కలిమి తీరగానె కనుపించు దైవంబు**

ఈ కలిమి ఎంతకాలము మనకు? ఇది కేవలము కదలిపోయే మేఘమువంటిది. ఈ ధన అహంకారముచేతనే మానవుడు దీనావస్థను పొందుతున్నాడు. కనుక, మొట్టమొదట భగవంతునకు అహంకారమనేదానిని అర్పితము చేయాలి. ఏ విధమైన అహంకారమూ వుండకూడదు. బల అహంకారముగానీ, యవ్వన అహంకారముగానీ, సౌందర్య అహంకారముగానీ, ధన అహంకారముగానీ, కుల అహంకారముగానీ, తపః అహంకారముగానీ ఏ మాత్రము అహంకారమనేటువంటిది వుండరాదు. అహంకారమును ఏనాడు భగవంతునకు అర్పితము గావింతుమో ఆనాడే మనము ఆత్మస్వరూపులుగా రూపొందుతాము. Dedicationలో మొట్టమొదట చేయవలసినది అహంకారమును అర్పితము చేయుటము.

**బాహ్యముగాను, అంతరంగములోను ఒకే భావమును కలిగియుండుటే నిజమైన భక్తి**

రెండవది Devotion. ఇది పవిత్రమైన ప్రేమకు సంబంధించినది. 'హృషీకేశ సేవనం భక్తిరుచ్యతే' అన్నారు. భక్తి అనగా నిరంతరము భగవంతుని తలంపుతో కూడినది. 'భజ్' అనే ధాతువునుండి పుట్టినది భక్తి. అనగా ప్రేమచేత భగవంతుని ఆరాధించటము, సంకల్పించటము, స్మరించటము, భజించటము, తపించటము. ఈ విధమైన చర్యలకు 'భక్తి' అని సార్థక నామము. ఈ భక్తిలో సేవ అతి ప్రధానమైనది. ఈ సేవవల్ల లభించే ఫలితము యిట్టిది, అట్టిది అని నిర్ణయించుటకు సాధ్యము కాదు. త్రివేణీ సంగమమునందు ఒకానొక సమయములో తులసిదాస్ భగవచ్చింతన చేస్తూ ఆరాధనలు సలుపుకుంటున్నాడు. రామలక్ష్మణులు యిరువురు చిన్నపిల్లల రూపము ధరించి అక్కడకు వచ్చి 'కాకాజీ! క్యా కరతాహై' అన్నారు. తులసిదాస్ చెప్పాడు 'రామ్‌కా సేవా కరతా' అని. రామలక్ష్మణులు తిరిగి 'సేవాకర్నేసే క్యాప్రయోజన్' అని ప్రశ్నించారు. 'బేటా! సేవా కర్నేసే మేవా మిల్తాహై' అన్నాడు. 'మేవా' అనగా ఉత్తరప్రదేశ్‌లో

sri sathyasai vachanamrutam

లభించే ఒకరకం మిఠాయికి పేరు. ఆ యిరువురు పిల్లలు చెప్పారు 'మేవా మిల్తాహై క్యా ప్రయోజన్. ఏక్ దఫా జీర్ణ హోసక్తాహై.' అప్పుడు చెప్పాడు తులసిదాస్ 'నాయనా! ఈ ప్రాకృతమైన మిఠాయి తిన్నంత మాత్రమున తాత్కాలికమైన మాధుర్యము, తాత్కాలికమైన భుక్తి తీరటము జరుగుతుంది. ఇది క్షణములో జీర్ణమై పోతుంది. నిజమే! కాని ఇది కాదు, భగవంతుడిచ్చిన మిఠాయి ప్రేమ మిఠాయి. అది జీర్ణమే కాదు. ఆకలే వుండదు. అనేక దినములు ఆరగించినప్పటికిని తృప్తి అనేదే వుండదు. ఆ ప్రేమ మిఠాయినే అందిస్తాడు సేవ వలన,' అని బోధించాడు. 'ఈ మిఠాయి జ్ఞానజ్యోతిని వెలిగిస్తుంది', అన్నాడు. 'అంతః కరణమనే ప్రమిదలో భక్తి అనే ప్రేమ రసమును పోసి, ప్రజ్ఞ అనే వత్తిని పెట్టి, విచారణ అనే నిప్పును అంటించినప్పుడు ఈ ప్రేమ అనే తైలము ప్రకాశవంతమైన ఆత్మజ్ఞానముగా వెలుగుతుంది' అన్నాడు. కనుకనే 'భక్తి' అన్నారు. భక్తి అనగా కేవలము భజనలు చేయటము మాత్రమే కాదు. ఏవో కొన్ని పూజలు చేయటము మాత్రమే కాదు. ఈనాడు మన భక్తి, మన పూజలు, మన భజనలు ఏ విధముగా వుంటున్నాయి? స్వార్థ, స్వప్రయోజనములతో కూడి వుంటున్నాయి. నిస్వార్థపరత్వముతో కూడినదే భక్తి. పైకి చూచుటకు అందరు భక్తులవలె కనిపిస్తారు. వారి చర్యలు చూస్తే చాలా వినయ, విధేయతలతో కనిపిస్తుంటాయి. కాని, హృదయములో చూస్తుంటే దీనికి విరుద్ధమైనదిగా వుంటుంది. దీనికోసమే చెప్పారు 'Marks చూస్తే Ranks వస్తాయి. ప్రవర్తన చూస్తే blanks వస్తాయి' అని. ఆచారములో చూచినప్పుడు భక్తిగా కనిపిస్తుంది. కానీ, హృదయముయొక్క తలంపులలో చూస్తే అది మహా అసహ్యముగా రూపొందుతుంది. అటువంటి తత్వాన్ని మనము ధరించరాదు. లోపల, వెలుపల ఒకే భావము, ఒకే తలంపు, ఒకే విధమైన ప్రేమ తత్త్వము వుంటుండాలి. కేవలము ప్రకటితము చేసేటువంటిదిగాని ప్రదర్శించేటువంటిదిగానీ కాదు, భక్తి. అలాంటి ప్రదర్శించేటువంటి భక్తి చాలా ప్రమాదమునకు గురి చేస్తుంది. కనుక, మనము ఈ ప్రమాదమునకు గురికాకుండా లోపల, వెలుపల ఒకే విధమైన భావాన్ని కలిగి వుండాలి. ఇదే నిజమైన భక్తి.

**మానవత్వమంతా నియమ, నిష్ఠలపైనే ఆధారపడియున్నది**

మూడవది discipline. ఇది చాలా అవసరము. మనము తెల్లవారి లేచిన తక్షణమే కాల

కృత్యములు తీర్చుకొని భగవంతుని స్మరించి తదుపరి ఏదో మన కర్మలు ఆచరిస్తూ ఉంటాము. ఈ కర్మలు నిత్యము మార్పు చెందనటువంటివి, కూర్పు కలగనటువంటివిగా మనము ఒక నియమాన్ని అనుసరించాలి. ఒక్కొక్కనాడు ఒక్కొక్క రకమైన మార్పు మనము తెచ్చుకోరాదు. ఈనాడు ఒక గంటకు లేవటము, రేపటి దినము మరొక పని చేయటము ఈ విధమైన మార్పులు వుండకూడదు. Discipline అనేది సక్రమమైన మార్గముతో అనుసరించాలి. పనులు వేరువేరుగా వుండవచ్చునుగాని, పరమాత్మ తత్త్వము ఒక్కటిగానే హృదయమునందు వుంచుకోవాలి. లేచిన తక్షణమే కాలకృత్యములు తీర్చుకొని ఒక ప్రశాంత వాతావరణమందు పరమాత్ముని కొన్ని నిముషములైనా హృదయ పూర్వకముగా స్మరించటానికి ప్రయత్నించాలి. నియమమే లేకపోతే మానవత్వము జీవించదు. మానవత్వమంతా నియమ నిష్టాదులపైనే ఆధారపడి వుంటున్నాది. నిత్యజీవితములోపల ఈ నియమాన్ని పాటిస్తూ రావాలి.

## విద్యకు వినయమే శోభ

నాలుగవది dicrimination, విచారణ శక్తి. ప్రపంచమంతయు మంచి, చెడ్డలతో కూడి వుంటుంది. సుఖదుఃఖములతో కూడి వుంటున్నాది. మానాభిమానములతో కూడి వుంటున్నది. జయాపజయములతో కూడి వుంటున్నది. ఈ ద్వంద్వములతో కూడిన ప్రకృతియందు ఏది మంచి ఏది చెడ్డ, ఏది చేయతగినది, ఏది చేయతగనిది అనే విచారణ మనము చెయ్యాలి. ఈ discriminative power మానవునకు ప్రధానమైనది. లేకపోతే మానవుడు పశువనే చెప్పవచ్చు. మనము మనసు నాధారము చేసుకోరాదు. బుద్ధిని అనుసరించాలి. మనసును అనుసరించినంతకాలము మనము మాధవులుగా తయారుకాము. ఏనాడు బుద్ధి ననుసరింతుమో ఆనాడే మనము మానవత్వమునుండి దివ్యత్వానికి ప్రవేశించగలము.

**మనసు నాధారముగ గొను మానవుండు**<br>
**పశువుకంటెను హీనమై పతనమగును**<br>
**బుద్ధి నాధారముగ గొను బుధజనుండు**<br>
**పశుపతిగ మారునని పల్కె పర్తిసాయి.**



sri sathyasai vacharamrutam

ఈ వయసులో విద్యార్థులు మనసును మాత్రమే అనుసరిస్తూ వుంటారు. వీరు బుద్ధివరకు ప్రయాణము చేయరు. కనుకనే అనేక విధములైన కష్టనష్టములకు గురి అవుతున్నారు. కొన్ని అశాంతులకు, అసంతృప్తులకు గురౌతున్నారు. నిరాశకు నిస్పృహకు గురౌతున్నారు. కనుకనే బుద్ధిని 'ఎక్కడ యేది చెయ్యాలి, యేది చేయకూడదు; ఎప్పుడు నేను పోవాలి యెప్పుడు పోకూడదు; నేను మానవుడను, విద్యావంతుడను, నేను యెలాంటి స్థాయిలో యే విధముగా చేసినప్పుడు నాకు గౌరవము కలుగుతుంది' అనే విచారణ చెయ్యాలి. విద్యావంతుడైకూడను విద్యాహీనునివలె ప్రవర్తించటము మానవత్వమునకు విరుద్ధమైన మార్గము. కనుక, నీ విద్యకు తగిన మార్గమును అనుసరించాలి. విద్యకు వినయమే ప్రధానమైన శోభ. ఆ వినయము లేకుండాపోతే విద్యకు యే మాత్రము కళవుండదు. కనుకనే ఎప్పుడు ఎక్కడ ఏ విధముగా యే రకమైన మార్గములో అనుసరించాలి అనే ఈయొక్క discrimination భక్తునకు అత్యవసరము.

ఐదవది determination పట్టుదల. ఈ పట్టుదలయే మంచి పగ్గము. మనము తలంచిన విషయములో యెట్టిసందేహములకు అవకాశము యివ్వక, అనుమానములకు అస్కారము లేకుండా పట్టుదలతో సాధించటానికి ప్రయత్నించాలి. నేను సాధించవలసినదానిని సాధిస్తానో లేదో అనే అనుమానమునకు అవకాశము యివ్వరాదు. నీకు పట్టుదల గట్టిగా వుండినపుడు సాధించలేనిది యీ జగత్తులో ఒక్కటీ వుండదు. మొట్టమొదటిది, చివరిది పట్టుదల. అక్కడ త్యాగము, యిక్కడ సాధన అనగా జయించటము. ఇదే పట్టుదల. ఈ రెండూ లేకపోతే మధ్యనున్నవి యే మాత్రముకూడను మనకు ఉపయోగము వుండవు. ఎంత భక్తి వున్నా, యెంత విచారణ సల్పినా, ఎన్ని నియమములు పూనినా యీ రెండూలేకపోతే పూర్తి వ్యర్థమవుతుంది. క్రింద కాళ్లు, పైన శిరస్సు లేకపోతే మొండెము కట్టుకొని యేమి చేయటము? నీ తెలివితేటలపైన నీవు ఆధారపడరాదు. నీమేధాశక్తిపైన నీవు ఆధారపడరాదు. ఈ సర్వమునకు దైవమే ఆధారమనే సత్యాన్ని గుర్తించాలి. అప్పుడే యీ భక్తితత్త్వమును మనము చక్కగా గుర్తించిన వారమవుతాము.

**వేరుపురుగు చేరి చెట్టునే పడగొట్టు**

sri sathyasaivachanamrutam

**చీడపురుగు చేరి కొమ్మరెమ్మల నంత చెడగొట్టు**
**కుత్సితుండు చేరి గుణవంతు చెరచురా.**

కుత్సితుడనగా యెవరంటే కేవలము నటన చేసేవాడు. భక్తి భక్తి అని ప్రచారము చేస్తూ దీనికి విరుద్ధమైన నడతలు గల్గినవాడు, కుత్సితుడు. లోపల ఒకటి, బయట ఒకటి అనే తంత్రములచేత జీవించువాడు కుత్సితుడు.లోపల చెడ్డను కోరటము, బయట మంచిని కోరుతున్నట్లుగా act చేయటము కుత్సితము. కావున, యిలాంటి కుత్సితునిదరికి చేరరాదు. ఇలాంటివారివలనే నేడు లోకములో మంచివారు చెడిపోతున్నారు. కనుక, అలాంటి భావములు మన హృదయములో యే మాత్రము ప్రవేశపెట్టరాదు.

**పంతులు లేని బడి, దేవుడు లేని గుడి, కరెంట్ లేని వైరు, నీరు లేని పైరు నిరర్థకము**

ప్రేమ రెండు రకములుగా వుంటున్నది - ఒకటి దేహప్రేమ, రెండవది దివ్యప్రేమ. ఈనాడు జగత్తులో వుండిన భయమునకు, భ్రాంతులకు, దుఃఖమునకు, అరాజకమునకు మూలకారణము దేహప్రేమయే! అక్రమ, అనాచార, అధర్మములకు మూలకారణము దేహప్రేమయే! దుష్పరిపాలనకు, యుద్ధమునకు, అన్నింటికి మూలకారణము యీ దేహప్రేమయే! చివరకు యీ దేహప్రేమ జగత్తునే నిర్మూలనము చేస్తున్నది. కానీ, దివ్యప్రేమ జగత్తును నిర్మాణము చేస్తుంది. శాంతి, ధైర్యము, సాహసము, ఆనందమును అందిస్తుంది. దివ్యప్రేమకు యే విధమైన భేదభావములు వుండవు. ఈనాడు మమకార, అభిమానములచేతనే దేహప్రేమను పెంచుకొని తద్వారా అనేక దుఃఖములకు గురైపోతున్నారు. అదే భారతయుద్ధమునకు మూలకారణము! 'మామకాః పాండవాశ్చైవ' అన్నాడు, ధృతరాష్ట్రుడు. ఈ మమకారమనే అహంకారముచేతనే కౌరవులందరు నిర్మూలమైనారు. దేహప్రేమను వుంచుకోవాలిగానీ, ఎంతవరకో అంతే! లోపల దివ్యత్వమనే చైతన్యమే లేకపోతే దేహము వుండి ప్రయోజనమేమిటి? పంతులు లేని బడి, దేవుడు లేని గుడి, కరెంటు లేని వైరు, నీరు లేని పైరు యీ విధమైనవి నిరర్థకమైపోతాయి. వీటివల్ల ప్రయోజన మేమిటి? మేము మానవులము, మానవులము అనుకున్నంత మాత్రమున మానవులము కానేరము. దివ్యమైన ప్రేమను అభివృద్ధి గావించుకోవాలి. దైవానికి మన అహంకారము అర్పితము చేయాలి. మనము

sri sathyasai vachanamrutam

దేనిని సాధించాలనుకున్నామో దానిని సాధించేవరకు పట్టుదల విడవకుండా వుండాలి. అప్పుడే మన భక్తి ప్రపత్తులు దివ్యమైన ఆనందతత్త్వము నందుకుంటాయి. కేవలము వేషభాషలయందుగాని, రాగములయందుగాని, భక్తి ప్రపత్తులు ప్రకటించినంత మాత్రమున అవి భక్తికి లక్ష్యము కాదు. దున్నపోతు తలమీద రెండు కొమ్ములున్నవి; ఏనుగుదంతముల విలువ దానికి యివ్వవచ్చునా? యివ్వరాదు.

**ఆకుపచ్చ పక్షులన్నీ చిలుకలవలె పలుకునా**
**పువ్వులపై పారాడెడు పురుగులు తుమ్మెదలగునా**
**పులిచర్మము కప్పినంత గాడిద తా పులియగునా**
**ఏనుగంత బలిసియున్న పంది ఏనుగగునటయ్యా?**

మనము ఆకారములో మానవులమని భావించవచ్చు. ఆచారములో మానవత్వము కావాలి. కనుక, ఆచారములోపల సరైన విచారణ సల్పి దివ్యత్వమును గుర్తించుకొని, పవిత్రతను అభివృద్ధిపరచుకొని ఆ పవిత్రమును నిర్మూలము గావించుకోటానికి తగిన కృషి చెయ్యాలి. అదే నిజమైన విద్య. విద్యనభ్యసించటమంటే ఏమిటి? శాశ్వతమైన దివ్యత్వమును గుర్తించుకునేకోసము విద్యనభ్యసించాలి.

**ఆరోగ్యమే మహాభాగ్యము**

ఆరోగ్యమే మహాభాగ్యము. ఆరోగ్యమునకు ఆటపాటలు అవసరము. అయితే యీ ఆటపాటలు క్రమబద్ధమైనవిగా నిర్మాణము చెయ్యాలి. దీనిలో కొన్ని విధములైన పట్టుదలలు మనము సాధించాలి. తప్పనిసరిగా ప్రతి ఒక్క వ్యక్తి ఆటలాడాలి. ఇప్పుడు హయ్యర్ సెకండరీ స్కూలులోపల పిల్లలు యెంతమంది యీ ఆటలలో పాల్గొన్నారు? మన Institute పిల్లలు ఎంతమంది యిందులో పాల్గొన్నారనేది యోచించుకుంటే Institute కే చాలా తలవంపులుగా వుంటున్నది. ఎందుకు పాల్గొనటం లేదని మనము ఎందుకు విచారించటము లేదు? ఈ పాల్గొనేదానియందు attendance తీసుకోవాలి. ఇది కూడా చదువులోపల ఒక భాగమే! దీంట్లోకూడా కొన్ని marks పెట్టాలి. పెట్టాము మార్కులు. కానీ యిచ్చేవారెవరు? చూచేవారెవరు? ఇది చాలాతప్పు. ఈనాడు మన Institute కి హయ్యర్ సెకండరీ స్కూలు పిల్లలంతా యెంతో



sri sathyasai vachanamrutam

గొప్ప పాఠము నేర్పినవారయ్యారు. ఇంతేకాదు, ఒక చిన్న విషయము. రెండు దినములముందు మన Institute లోపల Prizes యిచ్చాము. అప్పుడు యీ పేర్లు చదవటము, వారు యెందులో విజయాన్ని సాధించారని చెప్పటము. యేరకంగా చదివారు? యీ ప్రైజులు చదివేటప్పుడు అన్నిటిలో చేరి ఒకే పర్యాయము ఆ పిల్లలకు యిచ్చివేశారు. యిది యెంత ideal గా వుంటున్నది! ఒకపరి ఫుట్‌బాల్ అనటం మరొక పరి వాలీబాల్ అనటం; యేమిటో వాళ్లు రావటం పోవటం, యెంత అల్లరి జరిగింది! డిసిప్లిన్ లేదు. ఈనాడు యెంత చక్కని డిసిప్లిన్. యీ డిసిప్లిన్ యిన్‌స్టిట్యూట్ పిల్లలంతా నేర్చుకోవాలి. మంచి యెక్కడ వున్నప్పటికిని, యెవరు చేసినప్పటికిని చిన్న, పెద్దల తారతమ్యము లేదు. అందరి దగ్గర నేర్చుకోవలసినదే మంచి. పిల్లలు చిన్నవారు కావచ్చు. కానీ వారు చేసినటువంటిది గొప్ప ఆదర్శము. నేను Sports లో కూడా చూచాను. ఎక్కువమంది యీ జిమ్నాస్టిక్కులోగాని, చిన్నచిన్న రన్నింగ్‌రేసులలో గాని యింకా అనేక ఆటలలో గాని ఇన్‌స్టిట్యూట్ బాయిస్ కాకుండా హయ్యర్ సెకండరీ స్కూలు బాయిస్ చక్కగా చేస్తూ వచ్చారు. ఎక్కువమంది యిందులో పాల్గొన్నారు. కనుక దీనినిబట్టి మున్ముందు మనం నేర్చుకోవలసింది చాలా ఉన్నది. పెద్ద పిల్లలు ఆటలలో పాల్గొనలేదు. ఏమి? మీరు ఆటలాడకూడదా? వాళ్లకు ఆరోగ్యం అవసరం లేదా? ఇప్పుడు కొన్ని నిముషములు ముందుగా మీరు చూచారు. కొంతమంది fat పిల్లలంతా వచ్చినపుడు యెక్కువ claps చేస్తూ వచ్చారు. అంటే దీనియొక్క అంతరార్థము యేమిటి? ఈ విధముగా నీవు బలిసిపోవద్దు. ఆటలాడి ఆటలాడి దేహమును కొంత తగ్గించుకోమని teach చేయటమే అది. మనము తిన్నది జీర్ణము కావాలా, అక్కరలేదా? జీర్ణమై మన శరీరానికి వంట పట్టనక్కరలేదా? కేవలము loading, unloading లారీలు నింపినట్లు నింపుతుంటే వచ్చే ఫలితమేమిటి? సరైనటువంటి రీతిలో మనము శారీరకంగా కృషిచెయ్యాలి. అప్పుడే మనము అభ్యసించిన విద్య చక్కగా మన హృదయానికి హత్తుకుంటుంది. ఇది ఆధ్యాత్మికమునకు విరుద్ధమైనది కాదు. ఇది ఒక విధముగా మనసును అరికట్టటానికికూడా ఒక మార్గము అవుతుంది. కనుక, ప్రతి ఒక్క విద్యార్థి, పెద్దలు గానీ చిన్నలు గానీ యీ ఆటపాటలలో పాల్గొనాలి. మన హబ్బు చెప్పారు, cleanliness లో గాని discipline లో గాని unity లో గాని విద్యార్థులు ముందడుగులో ఉన్నారని. కానీ, అందులో ఆయన ఒక విషయమును అనగా Divinity ని గురించి

ప్రస్తావించలేదు. unity దేనిని అందిస్తుంది? Purity ని అందిస్తుంది. ఈ Purity యెక్కడకు పోయి చేరుతుంది? Divinity లో చేరాలి. లక్ష్యమును వదలిపెట్టి యీ Unity, Purity పెట్టుకొని ప్రయోజన మేమిటి? కనుక, యీ మూడింటియొక్క యేకత్వమును మనము సాధించాలి. అదే The proper study of mankind is man అనేది. మనము మనసునందు పరిశుద్ధమైన భావములు ప్రవేశపెట్టుకోవాలి. మనము చేసే కర్మలన్నీ శ్రద్ధాభక్తులతో సరైన రీతిలో ఆచరించాలి. అప్పుడే మనలో మంచి పవిత్రమైన భావాలు అభివృద్ధి అవుతాయి. భక్తి లేకపోతే మనశక్తి అంతా వ్యర్థము. ఎంత చదువుకున్నవాడైనప్పటికి కూడను "చదువులన్నియు చదివి చాల వివేకియై మదిని తన్నెరుగడు మందమతుడు" ఎన్ని చదువులు చదివి యేమి ప్రయోజనము?

**తరచి చదువు చదవ తర్కవాదమెగాని**
**పూర్ణజ్ఞానమెపుడు పొందలేడు**
**చదువులన్నియు చదివి చావంగనేటికి**
**చావులేని చదువు చదవవలయు.**

## దైవానుగ్రహమును పొందితే సర్వము మనకు హస్తగతమవుతాయి

ఏదోమనం marks,marks అని చూస్తున్నాము.Ranks,Ranks, అని చూస్తున్నాము. కానీ వెనుక మన జీవితములో యే విధమైన జీరోలు వస్తున్నాయో, మనలో ఏ విధమైన అశాంతులు చెలరేగుతున్నాయో వానిని యే మాత్రం యోచించటంలేదు. దైవయోగాన్ని సంపాయించుకోటానికి యే Certificate వుంది, నీదగ్గర? దైవానుగ్రహము ఒక్కదానిని సంపాయించుకుంటిమా అన్నీకూడను మనహస్తములోనే నిలచిపోతాయి. తులసిదాస్ అదే చెప్పాడు: "రామా! నీ అనుగ్రహము ఒక్కటి వుంటేచాలు, నవగ్రహములు నా హస్తగతం" అన్నాడు. కనుకనే మనము దేనిని సాధించాలో దానిని మొట్టమొదట సాధించాలి. అలాంటి దానిని సాధించే కృషిలో కొంతవరకు క్రమశిక్షణను ప్రవేశపెట్టడానికి ఆటపాటలుకూడా అత్యవసరం. ఈనాడు యీ హయ్యర్ సెకండరీ స్కూలు పిల్లలు చాలా చక్కగా ప్రదర్శించారు. అన్నింటియందు యీ హయ్యర్ సెకండరీ పిల్లలు జీవితాన్ని మంచి అభివృద్ధి గావించుకోవాలని నేను ఆశిస్తూ Institute పిల్లలతో హయ్యర్ సెకండరీ స్కూలు పిల్లలు వాలీబాల్ ఆడారు.

sri sathyasai vachanamrutam

అందులో కూడను Institute పిల్లలను ఓడించారు. హయ్యర్ సెకండరీ స్కూలు పిల్లలు గెలిచారు. ఇంకా జిమ్నాస్టిక్స్‌లో మూడు వంతులు హయ్యర్ సెకండరీ స్కూలు పిల్లలే వుంటున్నారు. ఏదో ఒకరో యిద్దరో ముగ్గురో యీ Institute పిల్లలు చేరారు. యీనాడు అన్ని రంగములయందు యెక్కువ భాగము Institute పిల్లలు కాకుండా హయ్యర్ సెకండరీ స్కూలు పిల్లలు గెలిచారు. కనుక కప్ వారికే యివ్వాలి. వచ్చే సంవత్సరము Institute పిల్లలు యేమైనా కృషి చేసి జయించుకుంటే వాళ్లకి వస్తుంది. నేను మరొకసారి చెపుతున్నాను. ఈ సంవత్సరము ఆటలలో హయ్యర్ సెకండరీ స్కూలు Best. జిమ్నాస్టిక్స్‌లో కూడను హయ్యర్ సెకండరీ స్కూలు పిల్లలే బాగా చేశారు. చాలా Best గా చేశారు.

**(తేదీ. 16-01-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam